విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య
www.suryaa.news



ప్రభాత సూర్య PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
12-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 191

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# వారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే!



**దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లీన్ చిట్**

**ఫిరాయింపు పిటిషన్లపై ప్రసాద్ కుమార్ తీర్పు**

- పార్టీ మారారనేందుకు సాంకేతిక ఆధారాల్లేవని వెల్లడి
- స్పీకర్ తీరును తప్పుబట్టిన బీఆర్ఎస్ నేత కేటీఆర్
- తమను ప్రశ్నించే అర్హత కేటీఆర్ కు లేదన్న కడియం
- తమపై కేటీఆర్ ది కక్షసాధింపు రాజకీయాలన్న దానం

2లో

# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం

సీఎం రేవంత్ తదితరుల హాజరు



# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి



'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ

- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,/ప్రభాత సూర్య:** తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో వీపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి

2లో



# యుద్ధంలోకి చైనా, రష్యా?

లాగాలని అమెరికా అధ్యక్షుడి ప్రయత్నం

పదే పదే ఆ రెండు దేశాల పేరెత్తుతున్న ట్రంప్

- చమురు ఎగుమతులను అడ్డుకుంటున్నఇరాన్
- గల్ఫ్ చమురు నౌకలను పేల్చేస్తామని హెచ్చరిక
- చైనా, రష్యాలకు ఆయిల్ కొరత ఏర్పడే ప్రమాదం
- ఇది జరిగితే రెండు దేశాలు యుద్ధంలోకి వచ్చే చాన్స్

2లో

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంలోకి చైనా, రష్యా కూడా రానున్నాయా? ఇరాన్ కు మద్దతుగా బరిలోకి దిగనున్నాయా? అంటే ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఆ అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు దేశాలను యుద్ధంలోకి దించాలని అమెరికా అధ్యక్షుడు ఇప్పటికే పలు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు గల్ఫ్ దేశాల నుంచి క్రూడాయిల్ ఎగుమతి కాకుండా ఇరాన్ అడ్డుకుంటోంది. ఈ సంక్షోభానికి అడ్డుకట్ట వేయాలంటే తాము రంగంలోకి దిగాల్సిందేనన్న ఆలోచనలో రెండు దేశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

(ప్రభాత సూర్య.. తెలంగాణ బ్యూరో )

ఇరాన్ మీద అమెరికా, ఇజ్రాయెల్ విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నాయి. కేవలం సైనిక స్థావరాల మీదనే కాకుండా.. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ ఆస్తులను సర్వనాశనం చేస్తున్నాయి. విద్యుత్, రోడ్లు, నీరు, ఇంటర్నెట్ తో పాటు ఇరాన్ ఆర్థిక మూలాలను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ఇరాన్ బేషరుతుగా లొంగిపోయేదాకా ఈ దాడులు కొనసాగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

# ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్, అమెరికా

- భారీ స్థాయిలో దాడులకు దిగుతున్న ఇరాన్
- దుబాయ్ విమానాశ్రయం, చమురు కేంద్రాలపైనా
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలూ లక్ష్యమేనని ప్రకటన
- భారతీయునితో సహా నలుగురికి గాయాలు



## స్వయం సహాయక మహిళలకు ఆరోగ్య పరీక్షలు

- ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలు
- ఇందులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- అధికారులతో మంత్రి దామోదర సమీక్ష

హైదరాబాద్:రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు

2లో

## స్విగ్గీ జొమాటోల ఆన్‌లైన డిస్కౌంట్లకు చెక్

- ప్రతి సోమవారం ఇక హోటళ్లకు సెలవు
- ఎపి స్టార్ హోటల్స్ అసోసియేషన్ నిర్ణయం
- గ్యాస్ కొరత కారణంగా పలు నిర్ణయాలు

# కేటీఆర్ మిస్.. కవితకు క్రెడిట్

రాజకీయాల్లో అవకాశాల్ని అందిపుచ్చుకున్నవారే ఎదుగుతారు. ప్రజల పక్షాన నిలిచి పోరాడి.. ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయడం అంత తేలికైన విషయం కాదు. అధికారంలో చేతిలో ఉన్నవేళ.. సర్కారు ఒక పట్టాన వినదు. అలాంటి పరిస్థితుల్లోనూ.. తగ్గకపోతే మొత్తానికే నష్టమన్న సంకేతం సర్కారుకు అర్థమయ్యేలా చేయటం చాలా అవసరం. అలా చేసినవారు తర్వాతి కాలంలో తిరుగులేని నాయకులవుతారు. వెలుగుమట్ల బాధితుల విషయంలో కల్వకుంట్ల కవిత నాయకురాలిగా సక్సెస్ అయ్యారు.



- వెలుగుమట్ల వివాదాన్ని అందిపుచ్చుకున్న కవిత
- బాధితులకు న్యాయం కోసం పోరాటం.. నిరాహార దీక్ష
- ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో పెరిగిన ఇమేజ్
- ప్రెస్ మీట్లు, సోషల్ మీడియాకే పరిమితమైన కేటీఆర్
- తమ వల్లే సర్కారు దిగొచ్చిందని చెప్పలేని పరిస్థితి

(ప్రభాత సూర్య.. తెలంగాణ బ్యూరో )

సరైన సమయంలో స్పందించే విషయంలో తన టైమింగ్ కు తిరుగులేదన్న విషయాన్ని తన చేతలతో చేసి చూపించారు.

2లో



## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి

2లో

# వాణిజ్య నౌకలపై గురి!

(మొదటి పేజీ తరువాయి)

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం తగ్గుముఖం పట్టే సూచనలే కన్పించడం లేదు. 12వ రోజైన బుధవారం ఇజ్రాయెల్--అమెరికా, ఇరాన్ భారీ స్థాయిలో పరస్పర దాడులను కొనసాగించాయి.

పర్షియన్ గల్ఫ్ పొడవునా పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ భారీ స్థాయిలో దాడులకు దిగింది. యూఏఈ నౌకాశ్రయంలో ఒక కంటైనర్ నౌకపై డ్రోన్ దాడి జరిపింది. నౌక పూర్తిగా ధ్వంసమైనట్టు పేర్కొంది. అంతేగాక దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా ఇరాన్ మరోసారి డ్రోన్ దాడులు జరిపింది. రెండు డ్రోన్లు విమానాశ్రయంపైనే పడి పేలిపోయాయి. ఈ ఘటనలో ఒక భారతీయునితో సహా నలుగురు గాయపడ్డారు. అయితే విమానాల రాకపోకలు యథావిధిగా కొనసాగినట్టు విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి. అంతేగాక గల్ఫ్‌లోని అతి పెద్ద చమురు శుద్ధి కేంద్రాలపై కూడా ఇరాన్ ఎడాపెడా దాడులు జరిపింది. ఇకపై పశ్చిమాసియాలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కూడా లక్ష్యంగా



చేసుకుని పెద్దపెట్టున దాడులు చేస్తామని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ ప్రకటించింది. దాంతో ఆ ఆర్థిక సంస్థల పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ప్రయోగించిన 8 డ్రోన్లను నేలకూల్చినట్టు కువైట్, 5 డ్రోన్లను అడ్డుకున్నట్టు సౌదీ అరేబియా వెల్లడించాయి. ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపైకి ప్రయోగించిన 6 బాలిస్టిక్ క్షిపణులను కూడా నేలకూల్చినట్టు సౌదీ తెలిపింది. ఖతర్, ఒమన్, బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ పెద్ద సంఖ్యలో డ్రోన్ దాడులు జరిపింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో రువైస్ చమురు శుద్ధి కేంద్రాన్ని మూసేస్తున్నట్టు యుఏఈ ప్రకటించింది. ఇజ్రాయెల్‌లో టెల్ అవీవ్, జెరూసలేంతో పాటు పలు నగరాలపైకి భారీగా క్షిపణులు ప్రయోగించింది. మరోవైపు ఇజ్రాయెల్--అమెరికా సంయుక్త దాడులు బుధవారం కూడా ఇరాన్‌ను అల్లాడించాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాలపై క్షిపణులు, బాంబుల వర్షం కురిసింది. టెహ్రాన్‌లోని బ్యాంక్ సఫా భవనం దాడుల్లో తీవ్రంగా దెబ్బ తింది.

# యుద్ధంలోకి చైనా, రష్యా?

(మొదటి పేజీ తరువాయి)

అయితే అమెరికాకు లొంగిపోయే ప్రసక్తే లేదని, ధీటుగా పోరాడతామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రకటించారు. ట్రంప్, నెతన్యాహు సమాధుల దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఆయన ప్రకటన తర్వాత డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ తో ఒప్పందాలు, చర్చలు ఏమీ లేవని.. ఇరాన్ ను సర్వనాశనం చేస్తామని ప్రకటించారు. దీంతో యుద్ధం మరింత భయంకరంగా మారుతోంది. రెండు రోజులుగా యుద్ధం అత్యంత భయంకరంగా సాగుతోంది. అటు ఇరాన్ కూడా తన చుట్టూ ఉన్న గల్ఫ్ దేశాలపై ఇకపై దాడులు చేయబోమని ప్రకటించింది. కానీ ఆ దేశాల నుంచి అమెరికా ఇరాన్ మీద దాడులు చేస్తే మాత్రం.. ప్రతిదాడులు తప్పవని హెచ్చరించింది. ఇప్పటికే ఈ యుద్ధంలోకి చాలా దేశాల ప్రత్యక్షంగా దిగేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మరైవైపు ఇరాన్ చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. గల్ఫ్ దేశాల నుంచి ఎలాంటి చమురు ఎగుమతులు ఉండట్లేదు. ఇదే అదనుగా అమెరికా, ఇజ్రాయెల్ తీవ్రంగా దాడులు చేస్తున్నాయి. ఇజ్రాయెల్ మీద ఇరాన్ దాడులు కూడా భీకరంగా సాగుతున్నాయి. ఇలా ఇరు దేశాలు ఒకరిపై ఒకరు అత్యంత భయంకరంగా దాడులు చేసుకుంటున్నాయి. ఇరాన్ తగ్గకపోవడంతో యుద్ధం తీవ్రత మరింత పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ సైనిక శక్తిని మూకుమ్మడిగా ఎదుర్కునే సామర్థ్యం ఇరాన్ కు లేకపోయినా.. వెనక్కు తగ్గట్లేదు. భీకరంగా ప్రతి దాడులు చేస్తూనే ఉంది. ఈ యుద్ధంలోకి రష్యా, చైనాలను లాగాలని అగ్రరాజ్యం చూస్తోంది. ఆ దేశాలు వచ్చినా రాకపోయినా.. ఇరాన్ ను మరింతగా నష్టపరిచేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధం అయినట్టు కనిపిస్తోంది.

**వారం రోజులు దాటినా..**

పశ్చిమాసియా యుద్ధం వారం రోజులకు చేరుకుంది. మొదలైన రెండు మూడు రోజులకే పూర్తవుతుందని అంతా అనుకున్నారు కానీ.. యుద్ధం ఇంకా కొనసాగడం అంటే దాని పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే తాజాగా ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ సంచలన ఆరోపణలు చేసింది. ఇరాన్ వెనక రష్యా ఉందని.. ఆయుధపరంగా సాయం చేస్తోంది కాబట్టే.. తమ యుద్ధ విమానాల మీద క్షిపణులతో ఇరాన్ దాడి చేయగలుగుతుంది అంటూ వ్యాఖ్యలు చేసింది. అయితే ఈ వ్యాఖ్యలను రష్యా ఖండించింది. రాజకీయపరంగా ఇరాన్ మీరా దాడిని ఖండించాం తప్ప.. ఆయుధ పరంగా, సైనిక పరంగా ఎలాంటి సాయం చేయట్లేదని తెలిపింది. అటు ఇరాన్ వాడుతున్న ఆయుధాలు పూర్తిగా చైనావే అని అమెరికా మరో ఆరోపణ చేస్తోంది. రీసెంట్ గానే భారత సముద్ర జలాల్లో ఇరాన్ కు చెందిన నౌకను అమెరికా ముంచేసింది. భారత సముద్ర జలాల్లోకి వచ్చి మరీ యుద్ధం చేయడం అంటే.. అమెరికా ఆలోచన విధానం ఏంటో అందరికీ స్పష్టంగా అర్థమవుతోంది. ఈ యుద్ధంలోకి రష్యా, చైనాను లాగాలని ట్రంప్ చూస్తున్నారు. అందుకే పదేపదే రష్యా, చైనా పేరు ఎత్తుతున్నారు.

## స్వయం సహాయక మహిళలకు ఆరోగ్య పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమ పురోగతి, అమలు తీరుపై బుధవారం ఆయన సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ నుంచి ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్ పాల్గొనగా.. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సహా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. టెస్టుల కోసం గ్రామాల నుంచి మహిళలను హాస్పిటల్స్‌కు తీసుకురావడానికి, పరీక్షల అనంతరం వారిని తిరిగి సురక్షితంగా ఇళ్ల వద్ద దింపడానికి వాహనాలను సమకూర్చాలని సెర్ప్ అధికారులకు సూచించారు. హాస్పిటల్స్‌లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎక్కువసేపు వేచి ఉండే అవసరం లేకుండా అవసరమైన మేర డాక్టర్లు, సిబ్బందిని అందుబాటులోకి ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. కుర్చీలు, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

# వారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే!

(మొదటి పేజీ తరువాయి)

**తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల చుట్టూ తిరిగిన రాజకీయ డ్రామా ఎట్టకేలకు ముగిసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పు వెలువరించారు. వీరిద్దరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలేనని, పార్టీ మారారనేందుకు సాంకేతిక ఆధారాల్లేవని ప్రకటించారు. దీంతో వీరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.**

నిజానికి ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఇంత త్వరగా ముగుస్తుందని ఎవరూ ఊహించలేదు. గతంలో ఇలాంటి విషయాల్లో సుదీర్ఘమైన జాప్యం జరిగేది. వివాదాన్ని ఐదేళ్లపాటు కొనసాగించి.. మరో ఒకటి రెండు రోజుల్లో ఆ ఎమ్మెల్యేల పదవీకాలం ముగుస్తుందనగా స్పీకర్ తీర్పు వెలువరించిన సంఘటనలు గతంలో ఉన్నాయి. కానీ, ఈసారి మాత్రం వ్యవహారం ఇంత వేగంగా ముగియడానికి ప్రధాన కారణం సుప్రీంకోర్టు జోక్యమే. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో 10 మంది కాంగ్రెస్ లో చేరడంతో ఆ పార్టీ స్పీకర్ కు ఫిర్యాదు చేయడం, అయినా స్పీకర్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ నేతలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై

చర్యలు తీసుకోవడంలో స్పీకర్ ఆలస్యం చేస్తున్నారంటూ వారు సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చి 12 లోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. గడువు ముగుస్తుండడంతో, స్పీకర్ వరుస విచారణలు చేపట్టి, అందరూ ఊహించినట్లుగానే ఈ పిటిషన్లను కొట్టివేశారు. గురువారం (మార్చి 12న) సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు రానున్న తరుణంలో ఒక రోజు ముందే స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు.

**ఆధారాలు లేవని క్లీన్ చిట్!**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించినట్లు బలమైన ఆధారాలు లేవని స్పీకర్ తన నిర్ణయంలో పేర్కొన్నట్లు సమాచారం. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. ఆ తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా.. పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇక స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి.. ఆ తరువాత తన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ తరఫున వరంగల్ ఎంపీగా గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఈయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ పిటిషన్ వేశారు. అయితే.. దానం నాగేందర్, కడియం శ్రీహరి సాంకేతికంగా మరో పార్టీలో చేరినట్లు రికార్డుల్లో నిరూపితం కాలేదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్, ఇప్పుడు ఈ ఇద్దరికీ కూడా ఊరటనిచ్చారు.

**మళ్లీ సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్?**

మొత్తంగా 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు అనుకూలంగా స్పీకర్ తీసుకున్న నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతలు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం కనిపిస్తోంది. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా, ఒక్కరిపై కూడా అనర్హత వేటు పడకపోవడం విస్మయానికి గురిచేస్తోందని, సాంకేతిక కారణాలతోనే వీరందరికీ క్లీన్ చిట్ ఇచ్చారా అని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. వాస్తవానికి పార్టీ ఫిరాయింపుల చట్టం అనేది రాజకీయాల్లో నైతికతను కాపాడటానికి ఉద్దేశించినది. కానీ, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే చట్టంలోని లొసుగులను వాడుకుని ఎమ్మెల్యేలు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి సులభంగా మారిపోతున్నారనే చర్చ మొదలైంది. ఏది ఏమైనా, స్పీకర్ నిర్ణయంతో కాంగ్రెస్ క్యాంప్‌లో పండుగ వాతావరణం నెలకొనగా, బీఆర్ఎస్ శిబిరాన్ని మాత్రం మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్పీకర్ స్థానంలో ఉండి నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన వారు.. ఇలా ఏకపక్షంగా, అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం దారుణమని వ్యాఖ్యానించారు.

# కేటీఆర్ మిస్.. కవితకు క్రెడిట్

(మొదటి పేజీ తరువాయి)

అదే సమయంలో ఆమె సోదరుడు కేటీఆర్ మాత్రం ఈ విషయంలో ఫెయిల్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు అందివచ్చిన వెలుగుమట్ల వివాదంలో అన్నాచెల్లెళ్లు అయిన కేటీఆర్.. కవితల తీరు భిన్నంగా ఉంది. ఈ వ్యవహారంలో అందరి కంటే ఎక్కువగా హైలెట్ అయ్యింది కవితనే. దీనికి కారణం.. బాధితుల పక్షాన నిలిచి పోరాడాలని నిర్ణయించుకోవడమే కాదు.. అందుకు ఎంతవరకైనా సరే వెళదామన్నట్లుగా ఆమె తీరు కనిపించింది. అందుకు తగ్గట్లే ఖమ్మం వెళ్లిన కవిత.. బాధితులతో కలిసి.. వారితో పాటే.. వారి వద్దే నిరాహార దీక్ష చేపట్టారు. వారికి సంఘీభావంగా బాధితుల పూరిగుడిసెల్లోనే ఉన్నారు. ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేలా చేశారు. అయితే తన దీక్షను ఆపే ప్రసక్తే లేదని తేల్చిన కవితను.. అర్ధరాత్రి వేళ బలవంతంగా పోలీసులు ఖమ్మం నుంచి హైదరాబాద్ కు తీసుకొచ్చారు. అయినప్పటికీ తాను దీక్షను కొనసాగిస్తానని, ప్రభుత్వం సానుకూల ప్రకటన చేసే వరకు తన పోరు ప్రకటించారు.

**చెల్లెలికి భిన్నంగా అన్న తీరు..**

చెల్లెలు కవిత నేరుగా ఇలా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పోరు చేస్తే.. ఆమె అన్న కేటీఆర్ మాత్రం డిజిటల్ మీడియా.. సోషల్ మీడియాలను వేదికగా చేసుకొని ప్రభుత్వాన్ని విమర్శించారు. అర్ధరాత్రి వేళ గుడిసెల కూల్చివేతలకు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. పేదల వ్యతిరేక ప్రభుత్వమంటూ ప్రెస్ మీట్లు పెట్టటం.. ప్రభుత్వ తీరును తప్పు పడుతూ దుమ్మెత్తిపోయడానికే పరిమితమయ్యారు. అంతేతప్ప.. నేరుగా బాధితుల వద్దకు వెళ్లి.. వారితో మమేకమై.. వారికి అండగా ఉంటామన్న భరోసా ఇవ్వలేదు. వారితో కలిసి పోరాటంలో పాలుపంచుకోలేదు. దీంతో.. కేటీఆర్ కు మించి కవితనే ఈ వ్యవహారంలో హైలెట్ అయ్యారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తాజాగా రేవంత్ రెడ్డి సర్కారు వెలుగుమట్ల బాధితులకు పట్టాలు ఇస్తామని, ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించటంతో.. కవిత పోరాటం వల్లే ఇదంతా సాధ్యమైందన్న మాట వినిపిస్తోంది. దీంతో కవిత ఇమేజ్ ఒక్కసారిగా పెరిగిపోయే అవకాశం ఉంది. మరి దీనిని కేటీఆర్ ఎలా తీసుకుంటారో, రేసులో ముందుండేందుకు తదుపరి ఏం చేస్తారో చూడాల్సి ఉంది.

# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, ప్రభాత సూర్య..:** తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య..:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

## స్విగ్గీ జొమాటోల ఆన్‌లైన డిస్కౌంట్లకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

**విజయవాడ,ప్రభాత సూర్య..:** యుద్ధం వల్ల కమర్షియల్ గ్యాస్ వినియోగం తగ్గించాలని కేంద్రం ఇప్పటికే ప్రకటన చేసిందని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి వెల్లడించారు. దీనిని డీలర్లు సాకుగా చూపి ఇప్పుడే కృత్రిమ కొరత ఉందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరతపై సీఎం చంద్రబాబు కేంద్రంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని చెప్పారు.కమర్షియల్ గ్యాస్ వినియోగం తగ్గిస్తే కొరతను అధిగమించ వచ్చని విజయవాడ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ వెల్లడించారు. బుధవారం విజయవాడలో కమర్షియల్ గ్యాస్ కొరతపై హోటల్స్ అసోసియేషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. స్విగ్గీ, జొమాటో ఆన్‌లైన్ వ్యాపారాల్లో డిస్కౌంట్ ఆపాలని ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్ణయించింది. రెండో విడతలో పూర్తిగా ఆన్‌లైన్ వ్యాపారం ఆపేస్తామని ప్రకటించింది. ప్రతి సోమవారం రెస్టారెంట్లు పూర్తిగా మూసి వేస్తామని హోటల్స్ అసోసియేషన్ తెలిపింది. వీక్లీ హాలిడే ప్రకటిస్తే కొంత వరకు గ్యాస్ ఆదా అవుతుందని అభిప్రాయపడింది.

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యార్థం ముందడుగు వేసిన 2001- 2002 బ్యాచ్







### 1 బీరువా బహుకరణ

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రకటన

### సీసీ కెమెరాలు ఏర్పాటు కు ప్రకటన

### అభినందించిన మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం

**మునుగోడు మార్చ్ 11(ప్రభాత సూర్య):** మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 - 02 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలపై ఉన్న మమకారంతో పాఠశాలలో సౌకర్యార్థం పాఠశాలకు 1 బీరువా అందజేశారు..4 సీసీ కెమెరాలు ఏర్పాటు తోపాటు 2025 - 26 సంవత్సరంలో 10 వ తరగతిలో పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 12 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి 7 వేల రూపాయలు,తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి 5 వేల రూపాయలు నగదు ప్రోత్సాహ బహుమతులు అందజేస్తామనీ ప్రకటించడం జరిగింది...ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం పాల్గొని మాట్లాడారు..చదివిన పాఠశాలను చదువు చెప్పిన గురువులను మరచిపోకుండా గుర్తుకు ఉంచుకొని పాఠశాల సౌకర్యార్థం ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం..ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థికంగా బరోసా కల్పించడం అభినందనీయం అని,ప్రతి ఒక్కరు 2001 - 02 పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ ,ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందించి విద్యార్థులకు వెన్నంటి ఉండడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. పాఠశాల మనది మన అందరిదీ ప్రతి ఒక్కరు ఈ పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు..పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని,విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకోవడం జరుగుతుంది, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. క్రమశిక్షణతో ఉండి గురువులను గౌరవిస్తూ ,ప్రతి ఒక్కరు కష్టపడి చదివి పాఠశాలకు,గ్రామానికి, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని, ఉన్నత స్థాయిలో ఎదగాలని, భవిష్యత్ లో మీరు కూడా చదివిన పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు..పాఠశాల అభివృద్ధికి ఎప్పుడు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో.2001 - 02 పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,కూరెళ్ళ జ్ఞానేశ్వర్,ఈద ప్రవీణ్,బొల్లు సైదులు,చెరుకు నరేందర్, ముచ్చపోతుల శ్రవణ్ కుమార్ నారగోని శ్రీశైలం,పాఠశాల చైర్మన్ పందుల ఎల్లమ్మ,పాఠశాల ఉపాధ్యాయులు కే సత్తిరెడ్డి,రత్నయ్య,అన్నపురెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..



## భారత తొలి మహిళా టీచర్ సావిత్రి భాయి ఫూలే స్పూర్తితో అందరికీ సమానమైన, నాణ్యమైన ఉచిత విద్య కోసం ఉద్యమిద్దాం...

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య.:** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బేజాడి వినోద మాట్లాడుతూ బాలికా విద్యా కోసం,మహిళా సంక్షేమం కోసం సావిత్రి భాయి పూలే అసాధారణ కృషి చేశారని అన్నారు. వారు సాగించిన పోరాటాల స్పూర్తితో విద్యార్థి లోకం విజ్ఞాన మహిళా సాధికారతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మానవతా మూర్తి, సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించాలనీ అన్నారు.వారి ఆశయాల వెలుగులో నాణ్యమైన విద్య కోసం విద్యార్థిలోకం పోరాడాలనీ వారు పిలుపునిచ్చారు. 1848 లోనే బాలికల విద్య కోసం తొలి మహిళా పాఠశాలను స్థాపించి విద్యను సామాన్యులకు, మహిళకు అందుబాటులో తెచ్చిన తీరు ప్రశంసనీయం అని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా యువత అక్షర పోరాటంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయ సామాజిక ,ఆర్థిక, సాంస్కృతి రంగాలలో మహిళకు తగిన ప్రాతినిధ్యం, అవకాశాలే ఇవ్వాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న ఆధిపత్య దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. నేటి యువతరం మహాత్మ జ్యోతి రావు పూలే,సావిత్రి భాయి పూలే దంపతుల స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమలాలో బండారు రాణి, మహంకాళి ఋతు, తేజ, చిన్నారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వి. బి. జీ. రామ్. జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ సదస్సు....




**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య :** బీ జే పీ మోడీ ప్రభుత్వం శ్రామిక మహిళల స్వేచ్ఛపై, హక్కులపై,ఉపాధి అవకాశాలపై దెబ్బ తీయడాన్ని శ్రామిక పీడిత మహిళలు తీవ్రంగా నిరసించాలని, సంఘటితంగా ముందుకు సాగాలని,మోడీ ప్రభుత్వం మహిళల ఉపాధిని పై దెబ్బతీయాడానికి వీ బీ జీ రామ్ జీ పథకాన్ని ప్రవేశపెట్టిందని,ఈ పథకం అమలు మూలంగా లక్షలాది మంది మహిళలు ఉపాధిని కోల్పోతారని అందుకే మహిళలు ఈ పథకాన్ని తేలికగా తీసుకోవద్దని పెద్ద ఎత్తున పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత పిలుపునిచ్చారు.బుధవారం రోజున కొర్ర తాండా లో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం ను పురస్కరించుకొని ప్రగతిశీల మహిళా సంఘం(పీ ఓ డబ్ల్యూ)ఆధ్వర్యంలో వీ బీ జీ రామ్ జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ, అంతర్జాతీయ శ్రామిక మహిళా దినంను పాలవర్గ పార్టీలు ఒక వేడుకగా జరుపుతున్నాయని ముఖ్యంగా,మహిళల స్వేచ్ఛను, కనీస హక్కులను,సమానత్వాన్ని హరించివేస్తూ,జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ లను అమలు చేయాలని అన్నారు.ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పీ ఓ డబ్ల్యూ జిల్లా, మండల నాయకురాలు కొర్ర సుశీల,కొర్ర బుజ్జి,కొర్ర విజయ,కొర్ర కవిత,కొర్ర సోన,కొర్ర చిన్న సోన,కొర్ర లక్ష్మి ,కొర్ర గమ్మ, రామవత్ హాస్య, కొర్ర సుగుణ,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ ను సన్మానించిన ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్

**చౌటుప్పల్,మార్చి 11, ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండల ఫోటో,వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్స్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ను బుధవారం శాలువతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉడుగు రమేష్ గౌడ్,జిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం కాటంరాజు గౌడ్, చౌటుప్పల్ మండల అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుక్క స్వామి, సహాయ కార్యదర్శి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, చింతల గణేష్, భారత మధు, బొడిగె ప్రభాకర్ గౌడ్,కత్తుల రవి, కందగట్ల కృష్ణ, మెట్టు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఐ వి ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి పంపిణీ...

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య..:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సారాబు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆలేరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు బుధవారం రోజున పరీక్షలకు సంబంధించిన సామాగ్రినీ పరీక్ష ప్యాడు, పెన్నులు, పెన్సిల్లు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అని, అది భవిష్యత్తుకు పునాది అని అన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. పరీక్షల సమయంలో భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎర్ర లక్ష్మి,, కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ , ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు జంగ శ్రీధర్ యాదవ్ ,మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

### మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్







**చౌటుప్పల్,మర్చి11, ప్రభాత సూర్య :** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని , ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పుర చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శ్రీ స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ సహకారంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ చౌటుప్పల్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పనపై స్థానిక చౌటుప్పల్ కాంప్లెక్స్ లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం 3నెలలు నిర్వహించారు. పురపాలక కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల లయన్స్ క్లబ్ భవనంలో లైన్స్ క్లబ్ ఆఫ్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం అధ్యక్షతన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు శ్రీ రామానంద తీర్థ డైరెక్టర్ ఎన్ విహరి కృష్ణ,పుర చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రామానంద తీర్థ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు అందజేసిన ప్రశంస పత్రాలు బ్యాంకులలో రుణ సదుపాయం కోసం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పుర చైర్మన్ మోగదాల పావని మాట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి కల్పన కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అన్ని రంగాలలో మహిళలు ముందుకెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో మరింత మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించాలని క్లబ్ ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ పోలోజు శ్రీనివాస్ చారి, ట్రస్ట్ సెక్రెటరీ మోగుదాల రమేష్, సేవా సెక్రెటరీ అతహర్ పాష, ట్రెజరర్ సిలివేరు మంగయ్య, సభ్యులు ఉప్పు ఆంజనేయులు నాంపల్లి రమేష్, కొసనం రామ్ రెడ్డి బత్తిని రఘు తదితరులు పాల్గొన్నారు.



## భౌతిక కాయానికి నివాళులు అర్పించిన మార్కెట్ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి...

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య :**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య గారి తల్లి అనారోగ్యం వలన బుధవారం రోజు స్వర్గస్తులైనందున చిలుకు కిష్టయ్య స్వంత గ్రామం శారాజీపేట లో భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి . ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కిష్టయ్యని పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు .ఈ కార్యక్రమం లో డైరెక్టర్లు సిలివేరు బాలరాజ్, విట్టల్ నాయక్, శారాజీపేట సర్పంచ్ కంతి మధు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## మంతపురి గ్రామంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు కోసం అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ని కలసిన ఎమ్మార్పియస్ నాయకులు....

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య..:** ఆలేరు నియోజకవర్గం పరిధి ఆలేరు మండలంలోని మంతపురి గ్రామం లో మహనీయులు భారత రాజ్యాంగ నిర్మాత డా, బీ ఆర్ అంబేద్కర్, భారత మాజీ ఉప ప్రధాని డా, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం కోసం అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు కి ఎమ్మార్పియస్ బృందం మంతపురి గ్రామ యువకులతో కలసి వినతిపత్రం అందజేశారు. మహనీయుల ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగుతున్న విగ్రహాల స్థాపన కమిటి కి అధికారులు, ప్రజలు సహకారంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, దళిత ఐక్యవేదిక చైర్మన్ భట్టు రాంచంద్రయ్య, ఎమ్మార్పియస్ ఆలేరు మండల అధ్యక్షులు కందుల నర్సింగ్ రావ్ మాదిగ,ఆలేరు మండల,మంతపురి గ్రామ నాయకులు గ్యార భిక్షపతి మాదిగ,కందుల కర్ణాకర్, దిలీప్, రాజు, కృష్ణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## దూడల రాములు గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి..



**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య... :** ఆలేరు పట్టణానికి చెందిన క్రీడల ఉపాధ్యాయులు దూడల వెంకటేష్ గారి తండ్రి వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ ఆడెపు బాలస్వామి, మాజీ పట్టణ అధ్యక్షుడు మోరిగాడి వెంకటేష్ గౌడ్, జూకంటి ఉప్పలయ్య, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శివానందం



**పటాన్చెరు, మార్చి 11,ప్రభాత సూర్య:** మండలం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన శివానందం మర్యాదపూర్వకంగా జిల్లా మంత్రి దామోదర్ రాజా నరసింహను కలిశారు. పటాన్చెరు మండలం నందిగామ గ్రామ మాజీ సర్పంచ్ అయిన శివానందం, నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ బాధ్యుడు కాటా శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా కలిసి, తనపై నమ్మకం ఉంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నందిగామ సర్పంచ్ విక్రం గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మాదాసు రాజశేఖర్, మార్కెట్ కమిటీ సభ్యులు కూడా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.



# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్



**చౌటుప్పల్,మార్చి 11, ప్రభాత సూర్య :** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని, అది మనందరి బాధ్యత అని చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన బిప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అమృత్ మిత్ర పథకం కింద " ఉమెన్స్ ఫర్ ట్రీ" కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ మోగదాల పావని ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయ ప్రక్కన ఖాళీ స్థలంలో బుధవారం వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కుమార్ మాట్లాడుతూ.. పచ్చని మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకొని, భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. "మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం" మన ఇళ్ళ ముందున్న ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం మన సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 వార్డు కౌన్సిలర్ హన్ను మహమ్మద్, 17 వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి,19వ వార్డ్ కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, నాయకులు ఉడుగు రమేష్, చింతల సాయిలు, కొమ్ము లక్ష్మయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, దీప, హనుమాన్ ప్రసాద్ సానిటరీ ఇన్స్పెక్టర్, మెప్మా టిఎంసి కవిత, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్లు నరసింహా ,అంజయ్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## పేదల ఇళ్ల స్థలాలను లాక్కోవద్దు మాడుగులపల్లి తాసిల్దార్‌కు వినతిపత్రం అందించిన బొమ్మకల్లు గ్రామస్తుల

**మాడుగుల పల్లి //ప్రభాత సూర్య (మర్చి 11)ప్రతినిధి :** తమకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను కాపాడాలని కోరుతూ నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు గ్రామస్తులు బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం నిరుపేదలైన తమకు నివాసం కోసం పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ స్థలాలను వి.ఓ కార్యాలయం పేరుతో లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాల కేటాయింపు బొమ్మకల్లు గ్రామానికి చెందిన రేణుక, వెంకన్న సహా మరో 20 మందికి గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయి. ఆక్రమణ యత్నం నూతనంగా ఎన్నికైన సర్పంచి, ప్రభుత్వం కేటాయించిన ఈ నివాస స్థలాల్లో వి.ఓ ఆఫీస్ భవనాన్ని నిర్మించాలని చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. బాధితుల ఆవేదన మేమంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలము. మాకు ఉన్న ఏకైక ఆధారం ఈ ఇళ్ల పట్టాలే. ఇప్పుడు మా స్థలాలను లాక్కుంటే మేము ఎక్కడికి వెళ్లాలి? అని బాధితులు ప్రశ్నించారు. న్యాయం చేయాలని తమకు కేటాయించిన భూమిని కాపాడి, అక్కడ వి.ఓ ఆఫీస్ నిర్మాణం చేపట్టకుండా ఆపాలని తాసిల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక, సైదమ్మ, గంగ, మమత, రామ్ రెడ్డి, లచ్చమ్మ, సైదమ్మ, రమ్య, నరసమ్మ, నాగేశ్వరి, సరిత గ్రామస్తులు పాల్గొన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : డిఇఓ బిక్షపతి



**మిర్యాలగూడ మార్చి 11:-( ప్రభాత సూర్య):** ఈనెల 14 నుండి జరగనున్న ఎస్ఎస్సి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి కోరారు. బుధవారం మిర్యాలగూడ పట్టణం రైతు వేదికలో మిర్యాలగూడ డివిజన్ లోని ఎస్ఎస్సి పరీక్ష నిర్వహణ కోసం నియామకమైన ఇన్విజిలేటర్లకు పరీక్ష నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో డీఇఓ బిక్షపతి మాట్లాడుతూ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల న్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో సెల్ ఫోన్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబ డవన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్స్ పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యత వహించాలని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఒక పరీక్ష అయిపోయిన తర్వాత మరో పరీక్ష కోసం పాఠశాలకు వెళ్లి సంసిద్ధులయ్యేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోని అత్యుత్తమ ఫలితాల సాధన కొరకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎండి.యూసుఫ్,డిసిఇబి కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, మండల విద్యాధికారులు ధీరావత్ ధర్మానాయక్, లక్ష్మణ్ నాయక్, రవినాయక్, వెంకన్న, వరలక్ష్మి, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణ కాంత్ నాయక్, థావుర్య, తిరుపతి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సాజిద్అలీ, దస్తగిరి, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన రాఘవపురం సర్పంచ్ మమత సంతోష్..

**పటాన్చెరు, మార్చి 11,ప్రభాత సూర్య :** మండలం లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్), హైదరాబాదులోని కళలు, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో బుధవారం గాన సంస్కృతి (వాయిస్ కల్చర్)పై హైబ్రిడ్ విధానంలో కార్యశాల నిర్వహించారు. చెన్నైలోని కే.ఎం. మ్యూజిక్ కన్జర్వేటరీ (ఏ.ఆర్. రెహమాన్ ఫౌండేషన్)లోని హిందూస్థానీ మ్యూజిక్ ఫ్యాకల్టీ డాక్టర్ హంబుల్ షైన్ ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్నారు. దీనిని ఆయన ఆన్ లైన్ లో నిర్వహించి, స్వర శిక్షణ యొక్క శాస్త్రీయ, కళాత్మక అంశాలపై విలువైన అంతర్దృష్టులను విద్యార్థులకు అందించారు. ఒక గాయకుడు తమ గొంతును ఉపయోగించే వివిధ స్థాయిలు లేదా శ్రేణులు (రేంజెస్) గొంతు కదలికలు, నాణ్యతలో మార్పులను బట్టి మారతాయని హంబుల్ షైన్ చెప్పారు. ఛాతీ స్వరం (ఛెస్ట్ వాయిస్) తక్కువ స్థాయి స్వరాలు, మధ్యమ స్థాయి, హెచ్చు స్థాయి స్వరాలు (హెడ్ వాయిస్), సాధారణ స్వరాలు (ఫాల్సెట్టో), అత్యంత హెచ్చు స్వరస్థాయి లేదా ఈల వంటి ధ్వని (విజిల్ రిజిస్టర్)లతో సహా వివిధ స్వర స్థాయిల గురించి ఆయన వివరించారు. గాయకులు రాగాలను తగిన స్వర శ్రేణిలో ఎలా సమర్థవంతంగా పాడగలరో తెలుపుతూ, అదే సమయంలో స్వరంలో హెచ్చుతగ్గులు (మాడ్యులేషన్), స్వరాన్ని స్పష్టంగా లేదా దూరం వరకు వినిపించేలా (ప్రొజెక్షన్) చేసే నియంత్రణా పద్ధతులను కూడా ప్రదర్శించారు. ఈ



కార్యశాలలో సందర్భాను సారం శైలి (రిజిస్టర్ బ్లెండ్), రెండు అచ్చులు కలిసి ఒకే శబ్దాన్ని పలికే విధానం (వోవల్ బ్లెండ్) వంటి స్వర మిశ్రమ పద్ధతులను కూడా వివరించారు. ఇవి గానంలో శబ్ద సమతుల్యత (టోనల్ బ్యాలెన్స్), సున్నితమైన పరివర్తనలను సాధించడానికి అవసరమన్నారు. సాంకేతిక అంశాలతో పాటు, గానం యొక్క మానసిక కోణాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. గాత్ర ప్రదర్శనలో మానసిక సంసిద్ధత, నిరీక్షణ, ఏకాగ్రత, భావోద్వేగ సంబంధం యొక్క ప్రాముఖ్యతలను విశదీకరించారు. ఈ కార్యశాల చివర్లో విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవడానికి ప్రోత్సహించారు. ఆయన చేసిన ఆచరణాత్మక సూచనలు, ప్రభావవంతమైన స్వర స్థాయిల యొక్క సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడింది. ఈ కార్యశాలను లలిత, ప్రదర్శన కళల విభాగ అధ్యాపకులు ఆనందు మురళి, దర్బా మృదురవళి నిర్వహించి, సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు వృత్తిపరమైన గాత్ర శిక్షణ పద్ధతులకు విలువైన అవగాహనను అందించడమే గాక, సంగీత ప్రదర్శనలో గాత్ర సంస్కృతిపై వారి అవగాహనను పెంచింది.

# శ్రీ పరాభవ నామ సంవత్సరం పంచాంగం ఆవిష్కరణ





మిర్యాలగూడ, మార్చి 11:-( ప్రభాత సూర్య): సదా ధర్మం పరిడవిల్లే విధంగా పురజనులకు సత్య మార్గాలు సూచించుకుంటూ ముందుకు వెళ్లాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మిర్యాలగూడ పట్టణ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత, అర్చక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం పంచాంగం ఆవిష్కరించారు.. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు పులి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ మాట్లాడుతూ కొత్త తరం పంచాంగ గుణితముకు మక్కువ ప్రదర్శించాలన్నారు. గత తరంవారు పంచాంగాన్ని గుణించటం వలన ఇప్పటికి మనం పాటిస్తున్నామని కొత్త యువతరం పంచాంగము జ్యోతిషంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. బ్రాహ్మణులు గ్రామ ప్రజల జనుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తుంటారన్నారు. అర్చక , పురోహితులు కలిసి ఉండాలని వారికి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తనకు తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. నల్లగొండ జిల్లా బ్రాహ్మణ అఫీషియల్, నాన్ అపిషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాయప్రోలు మురళీకృష్ణ శర్మ మాట్లాడుతూ అర్చక పురోహితం లో కొనసాగుతున్న వారు వృత్తిపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా సంఘం అధ్యక్షులు రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ సంఘం నూతనంగా ఏర్పడక ముందు పలు సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని నల్గొండ జిల్లాలో మిర్యాలగూడ బ్రాహ్మణ పురోహిత అర్చకలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గౌరవ అధ్యక్షులు పులి కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్చక రోహిత సంఘం సేవలు ప్రశంసనీయమన్నారు. తిథులు ముహూర్తాలపై ప్రజలకు అవగాహన ఉందని, అర్చకులు, బ్రాహ్మణులు ముహూర్తాలు, తిథులు చూసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . మిర్యాలగూడ అర్చక పురోహిత సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు ఠయ్యాల ఫణి కుమారచార్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ, అర్చకుల ఆధ్వర్యం లో పంచాంగావిష్కరణ సంతోషంగా ఉందన్నారు. మిర్యాలగూడ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంలో ఉన్న ప్రతి సభ్యులు సంఘం కోసమే పని చేయాలి, సంఘంపై విమర్శలు చేయడం వలన ప్రయోజనం ఉండదన్నారు. ప్రముఖ వేద పండితులు సూలూరి శివ సుబ్రహ్మణ్యంశర్మ మాట్లాడుతూ సంఘ ధర్మాలు సభ్యులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కనకదుర్గ దేవాలయం ప్రధాన అర్చకులు తెంపెల్లి శంభు ప్రసాద్ శర్మ, ప్రముఖ పంచాంగ కర్త హనుమంతరావు, మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత, అర్చక సమాఖ్య కార్యవర్గ సభ్యులు, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, చెన్నూరు వేణుగోపాలరావు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభం ముందు సహస్రాణి బాలిక భగవద్గీత శ్లోకాలను పట్టించారు వారికి చిరు సత్కారం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ బ్రాహ్మణ పురోహిత అర్చక సేవా ముద్రించిన పరాభవ నామ సంవత్సర పంచాంగం, పెండ్యాల హనుమంతరావు రచించిన పంచాంగం ఆవిష్కరించారు, అతిథులను దుశాలువులతో సన్మానించారు.



## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన రాఘవపురం సర్పంచ్ మమత సంతోష్..

ఆలేరు మార్చి 11,ప్రభాత సూర్య: ఆలేరు మండలంలోని రాఘవాపురం గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. గ్రామ సర్పంచ్ మమత సంతోష్ పాల్గొని విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు,ఇతర పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఎలా సిద్ధం కావాలో విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు.. భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## లక్ష్యం దిశగా పదవ తరగతి విద్యార్థులకు అండగా నిలిచిన చెరుకుపల్లి శివరాణి



**మాడుగులపల్లి,11మార్చి (ప్రభాత సూర్య ) ప్రతినిధి :** మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ పదవ వార్డు మెంబర్ చెరుకుపల్లి శివరాణి రాజు ఆధ్వర్యంలో పరీక్ష రాయబోతున్న 10 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి జీవితాన్ని మలుపు తిప్పే పరీక్ష అని శ్రద్ధగా చదువుకొని మంచిగా పరీక్షలు రాయాలని వత్తిడి లేకుండా చదువుకుని ఆహ్లాదకర వాతావరణంలో ఒత్తిడి లేకుండా జీవితంలో ఎదగాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్,ఉపాధ్యాయులు వేణుగోపాలస్వామి, సోమయ్య,వెంకటయ్య, వెంకటేశ్వర్లు,రాజయ్య,భిక్షం మమత,సలీం పాష,జానీ పాష,తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇంటిని పరిశీలించి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



**మిర్యాలగూడ మార్చి 11:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కొండూరు బిక్షం పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో బుధవారం అగ్నిప్రమాదానికి గురై కాలిపోయింది. చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే ఆర్పీ వేశారు. ఇల్లు కాలిపోయిన విషయం వెంటనే తెలియడంతో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఇంటిని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తక్షణ సహాయం కింద 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేవిధంగా చేయాలని అధికారులకు ఫోన్ చేసి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్య, ఉపాధి లేని యువతపై కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ సర్వే

మిర్యాలగూడ, మార్చి 11:-( ప్రభాత సూర్య) మిర్యాలగూడ ప్రభుత్వ కెఎన్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరం ఐదవరోజు బుధవారం మిర్యాలగూడ మండలం గూడూరు, కిష్టాపురం గ్రామాలలో అధికారిక విద్య, సాధారణ ఉపాధిలో లేని యువత గురించి సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా గ్రామాలలో విద్యకు దూరంగా ఉన్న , ఉపాధి లేని యువత గురించి సమాచారం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి, ఐ క్యూఏసి కోఆర్డినేటర్ నాగరాజు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ నరేష్, నాగరేఖా రాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్ స్వప్న, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర్లు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**మిర్యాలగూడ, మార్చి 11:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ మండలం రుద్రారం, కొత్తపేట గ్రామాల్లో ఇందిరమ్మ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ బుధవారం పర్యటించి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను, గ్రామ పంచాయతీ కార్యాలయం భవనాన్ని సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని లబ్దిదారులను కోరారు. అనంతరం రుద్రారం గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ కొరత...

### ఇబ్బందులలో హాస్టల్ నిర్వాహకులు..

### ప్రభుత్వ జోక్యం కోరిన ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** హైదరాబాద్ నగరంలో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది హాస్టల్ నిర్వాహకులు, లక్షలాది మంది అతిథులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ (టీఎస్ఐటి సిహెచ్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికాశ్రీ విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాతా కరుణాకర్ మాట్లాడుతూ.. సమస్య తీవ్రతను వివరించారు. హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 11 వేల హాస్టళ్లు ఉండగా, వాటిలో దాదాపు 10 లక్షల మంది అతిథులు నివసిస్తున్నారని తెలిపారు. అయితే అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల ప్రభావంతో కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు . గ్యాస్ డీలర్లు ఇప్పటికే సుమారు 35 శాతం ధర పెంచినప్పటికీ, నిన్నటి నుంచి సరఫరాను పూర్తిగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహణలో గ్యాస్ ప్రాణవాయువులాంటిదని, గ్యాస్ లేకపోవడం వల్ల వంటలు చేయడం అసాధ్యంగా మారిందని అన్నారు. ఒక సిలిండర్ ద్వారా రోజుకు సుమారు 309 మందికి మాత్రమే భోజనం తయారు చేయగలమని, ప్రస్తుతం సరఫరా లేకపోవడం వల్ల అల్పాహారం, భోజనాల ఏర్పాటులో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. డీలర్లతో చర్చలు జరిపినా సమస్యకు సరైన పరిష్కారం దొరకలేదని, కనీసం నామమాత్రంగా అయినా గ్యాస్ సరఫరా చేయాలని కోరామని చెప్పారు. అవసరమైతే డొమెస్టిక్ గ్యాస్ ద్వారా అయినా హాస్టళ్లకు తాత్కాలికంగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లను ప్రాధాన్యత రంగంగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని సరిపడ గ్యాస్ అందించాలన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన ఈ సమస్యను ప్రభుత్వము అత్యవసరంగా పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ట్రెజరర్ మహీధర్, నాయకులు జయరామిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మధు, సూర్య, ప్రతాప్ రెడ్డి, వర్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత భరోసా సబ్సిడీ విడుదల చేయాలి- కందగట్ల బిక్షపతి నేత

**నల్గొండ ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రుణమాఫీ, చేనేత భీమా, భరోసా పథకం, మరియు సహకార సంఘాలకు క్రెడిట్ అప్పు మాకు చేసి ఆదుకోగలరని ఉమ్మడి నల్గొండ జిల్లాల చేనేత సహకార సంఘాల అసోసియేషన్ తెలంగాణ ప్రాంత చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు కందగట్ల బిక్షపతి నేత ప్రభుత్వాన్ని కోరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత భరోసా పథకం సబ్సిడీ సంవత్సరానికి బీవర్ 18000 అనుబంధ కార్మికుడికి 6000 చేస్తామని తెలిపారు, కానీ నేటి వరకు జమ చేయలేదు, చేనేత రుణమాఫీ బ్యాంకులలో తీసుకున్న రుణాలు లక్ష వరకు మాఫీ అని తెలిపారు అది ఉలుకు లేదు పలుకు లేదు, చేనేత భీమా కార్మికుడు 60 సంవత్సరాల నుండి చనిపోతే వయసుతో నిమిత్తం లేకుండా ఐదు లక్షల వరకు చేనేత భీమా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది కానీ సంవత్సరం నుండి పెండింగ్లో ఉంచింది. పావలా వడ్డీ పథకం రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు ఇవ్వవలసిన పావుల వడ్డీ డబ్బులు రెండు సంవత్సరాల నుండి విడుదల చేయట్లేదు, చేనేత సంఘాలకు మార్కెటింగ్ ఇన్సెంటివ్ రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహస్ర సంఘాలకు ఇవ్వవలసిన మార్కెటింగ్ ఇన్సెంటివ్ వెంటనే ఇవ్వాలి 20% రిబేట్ తో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.






# ఘనంగా ఆదిత్య రెడ్డి ఇఫ్తార్ విందు

## పటాన్‌చెరులో వెల్లివిరిసిన సోదరభావం...



**పటాన్చెరు, మార్చి 11,ప్రభాత సూర్య:** మండలం లోని మతసామరస్యం వెల్లివిరిసింది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలనే ఉన్నత ఆశయంతో. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ముస్లిం మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం గంగా, జమునా తెహజీబ్‌కు అద్దం పట్టింది. ఆయన మాట్లాడుతూ. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, త్యాగానికి మరియు భక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయడం అభినందనీ యమన్నారు. ముస్లిం సోదరులు ఇచ్చే ఇఫ్తార్ విందు కేవలం ఒక భోజనం మాత్రమే కాదనీ, అది విభిన్న వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించే గొప్ప వేదిక అని ఆయన కొనియాడారు. ఇఫ్తార్ వేడుకలో ముస్లిం మత పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు ముస్లిం సోదరులతో కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు. సాయంత్రం నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు అందరూ కలిసి ఇఫ్తార్ విందును ఆరగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ సోదరులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి శీఘ్ర పౌర సంస్కరణల పాలన భేష్..

## డి పి శ్రీనివాస్ రావు అంబేద్కర్ సేన తెలంగాణ కన్వీనర్..



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :శీఘ్ర పౌర సంస్కరణల ద్వారా హైదరాబాద్ పట్టణ ప్రకృతి దృశ్యాన్ని విప్లవాత్మకంగా మార్చిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి డైనమిక్ పాలనకు తెలంగాణ నేడు హృదయపూర్వకంగా ప్రశంసలు అందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వం తెలంగాణను సర్వతో ముఖాభివృద్ధి దిశగా పనిచేస్తుంది, అయినప్పటికీ విపరీతంగా వ్యాపించిన రోడ్‌సైడ్ పార్కింగ్ మన రోడ్లను ఇరుకున పెట్టింది. ప్రమాదాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అక్రమ పార్కింగ్‌ను నిర్మూలించడానికి, భారీ ఆదాయాన్ని సంపాదించడానికి, వేలాది మంది నిరుద్యోగ యువతను శిక్షణ పొందిన అటెండర్లుగా నియమించడానికి సమర్థవంతమైన చెల్లింపు రోడ్‌సైడ్ పార్కింగ్‌ను వెంటనే ప్రారంభించాలని డిపి శ్రీనివాస్ రావు కోరుతున్నారు అని కన్వీనర్ నొక్కి చెప్పారు. డిజిటల్ కియోస్క్‌లు, సిసిటివి , మొబైల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో కూడిన ఈ పరివర్తన దశ – ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తుంది, ఫుట్‌పాత్‌లను తిరిగి పొందుతుంది. సిఎం రేవంత్ రెడ్డి యొక్క పీపుల్-ఫస్ట్ మోడల్‌ను జాతీయ ప్రమాణంగా పెంచుతుంది. డిపి శ్రీనివాస్ రావు నేతృత్వంలోని అంబేద్కర్ సేన పూర్తి మద్దతును ఇస్తుందని ప్రతిజ్ఞ చేస్తుంది. 30 రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. డిపి శ్రీనివాస్ రావు, కన్వీనర్, అంబేద్కర్ సేన, తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇస్తున్నారు మరియు 30 రోజుల్లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 30వ వార్డు కార్పొరేషన్ హౌసింగ్ బోర్డ్ కమిటీ హాల్‌లో ఇఫ్తార్ విందు- జహంగీర్ బాబా

**నల్గొండ ప్రభాకర్ సూర్య:** నల్గొండ పట్టణంలోని 30వ వార్డు కార్పొరేషన్ హౌసింగ్ బోర్డ్ కమిటీ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఉపవాస విరమణ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు రంజాన్ మాసం పవిత్రతను గుర్తుచేస్తూ, సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా హాజరైన వారు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో జరిగి అందరూ కలిసి ఇఫ్తార్ విందును ఆస్వాదించారు షేక్ జహంగీర్ బాబా, నదీమ్, సల్మాన్, సజ్జద్, ఫసీ, వాజుయుద్దీన్, సమి, ఫజల్, రియాజ్, అఫ్రోజ్, అయాజ్, వసీమ్, సోహైల్, వాజీద్, అమీర్, వినయ్, మొహమ్మద్ సల్మాన్, సైఫ్




# జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సర్వసభ్య సమావేశం




**నల్గొండ ప్రభాత సూర్య :** ద్వారా రైతులకు పంట రుణాలతోపాటు, స్వయం సహాయక మహిళ సంఘాలకు ,ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు రుణ పంపిణీలో చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఇస్తున్నప్పటికీ7 లబ్ధిదారు ముందుగా బేస్మెంట్ వరకు నిర్మించుకోవలసి ఉన్నందున, లబ్ధిదారులు పేదవారైనందున బేస్మెంట్ వరకు నిర్మించుకునేందుకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. ఈ విషయంలో డిసిసి బ్యాంక్ మేనేజర్లు చొరవ చూపించాలని కోరారు. ఇందిర మహిళ శక్తి కార్యక్రమం కింద జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, ఇందులో భాగంగా వారికి తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చినట్లయితే ఎక్కువమంది గ్రూప్ సభ్యులు రుణ సౌకర్యం పొంది లాభపడేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని, అంతేకాక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. నల్గొండ జిల్లాలో దాన్యంతో పాటు ,వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున పండించడం జరుగుతున్నదని, అందువల్ల ఆయా అనువైన ప్రదేశాలలో కోల్డ్ స్టోరేజ్ లు, ఆహార ఉత్పత్తులు నిల్వ ఉంచుకునేందుకు ఉండే అవకాశాలను పరిశీలించి వారికి రుణ సౌకర్యం అందించాలని, డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో స్థలాలను గుర్తించి గోడౌన్ నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రబీ దాన్యం కొనుగోలు ప్రారంభమవుతున్న దృష్ట్యా పిఎసిఎస్ ల ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలుకు సంబంధిత సొసైటీలు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు అంతకుముందు నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శంకర్రావు మాట్లాడుతూ 1917 లో ప్రారంభమైన నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 108 సొసైటీలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదని, 1000 కోట్ల అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిపాజిట్లు, రుణాలు, రైతులకు, గృహ నిర్మాణానికి, విద్యార్థులు, వ్యక్తిగత రుణాలు, తదితర రంగాలలో ఇచ్చిన రుణాలు, తదితర అంశాలను వివరించారు.జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, యాదాద్రి, భువనగిరి జిల్లా, సూర్యాపేట డిసిఒలు రమణ, ప్రవీణ్, డిసిసి బ్యాంకు డిడిఎం తదితరులు ఉన్నారు.






# దివ్యాంగులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో జీవనోపాధి కల్పించాలని వినతి పత్రం

**మిర్యాలగూడ మార్చి 11:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని దివ్యాంగులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో జీవనోపాధి కల్పించాలని బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డికి మిర్యాలగూడ మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో దివ్యాంగులు, అంధులు, శారీరక, బధిరులు మొదలైన వారు ఉపాధి లేకుండా ఉన్నారని వారికి ప్రభుత్వ సంస్థలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించిందని అర్హత ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగ నియామకాలు చేసుకుని వారికి జీవనోపాధి కల్పిస్తున్నది అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు సంస్థలు, రైస్ మిల్లులు, సిఎంఆర్ మాల్ చెన్నై షాపింగ్ మాల్ జీవి మాల్ డి మార్ట్ రిలయన్స్ మార్ట్ లలిత జ్యువెలరీ, మలబార్ గోల్డ్ జ్యువలరీ మిర్యాలగూడలో అనేక మాల్స్ ఉన్నాయన్నారు. రాష్ట్రంలో బదిరులకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో ప్రభుత్వ బది రుల పాఠశాల, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ బదిరుల జూనియర్ కళాశాల కూడా కలదు అందువలన మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఎక్కువగా బధిరులు ఉన్నారన్నారు. మిర్యాలగూడలో 25 సంవత్సరాలు పైబడిన వారు ఎక్కువగా ఉన్నారని వారు అన్నారు వీరు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారు. వీరు శారీరకంగా దృఢంగా ఉంటారు పనిలో మంచి క్రమశిక్షణ కలిగి నిబద్ధత యాజమాన్యం చెప్పిన పని చేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారని యాజమాన్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటారన్నారు. వీరందరికీ సబ్ కలెక్టర్, స్థానిక మన ఎమ్మెల్యే ప్రైవేట్ యాజమాన్యంతో మాట్లాడి వారందరికీ ఉపాధి అవకాశం కల్పించవలసినదిగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అంజన్నపల్లి రామలింగం జిల్లా యాదగిరి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాలె జగన్, జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, ఎస్కే .షమీం, పరమేష్, వేణు, అనంతరాజు, ఎంఏ.అజీజ్, సిహెచ్ సిద్ధార్థ, మహేష్, మధు, శ్రీనివాస్ నాయక్, మౌనిక, కవిత, రాజు, రవి, రంజిత్, గౌస్ లు పాల్గొన్నారు

## సిడిఎస్ ఆధ్వర్యంలో ఆడపిల్లల్ని రక్షించు కోవలనే అంశంపై

# వ్యాసరచన,బహుమతులు అందజేత



**మిర్యాలగూడ, మార్చి 11:-( ప్రభాత సూర్య) :** ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని గాంధీనగర్ సెక్టార్ షాబునగర్ జడ్పిహెచ్ఎస్ లో సిడిపిఓ రేఖల మమత ఆదేశాలతో బేటీ బచావో బేటి పడావో(బీబిబిపి) కార్యక్రమంలో భాగంగా సేవ్ ద గర్ల్ చైల్డ్ పై పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన బాలికలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేశారు. సూపర్వైజర్ నజీమ బేగం మహమ్మద్ మాట్లాడుతూ ఆడపిల్లలను గర్భంలో ఉన్నప్పుడు చిదిమివేయరాదని భృణ హత్యలను నివారించాలన్నారు. పురిటిలోనే ఆడపిల్లలను చంపరాదన్నారు. ఆడపిల్లలు పుడితే వద్దనుకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఊయలలో వేయాలి అంతేగానీ అక్రమ దత్తత ఇవ్వరాదని ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇటీవల మొబైల్ లొ అనేకరకాల యాప్స్ లలో ఫ్రెండ్స్ రిక్వెస్ట్ పేరిట ఎన్నో మోసాలకు గురవుతూ తనువు చాలిస్తున్నారు. తెలిసి తెలియని వయస్సులో అవతలి వ్యక్తి చెప్పే మాయమాటలకు లొంగిపోవడం జరుగుతుందని ఆడపిల్లలు దూరంగా ఉండాలని ఎవరైనా తెలియని వ్యక్తి వివరాలు అడిగితే ఎటువంటి వివరాలు ఇవ్వద్దని 100 కు కాల్ చేసి సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలన్నారు. ఆడపిల్లలకు18సంవత్సరాలు , మగపిల్లలకు 21 వ సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు వివాహలు చేయరాదనీ తెలిపారు. బాల్యవివాహాలకు పాల్పడితే చట్టపర శిక్ష లకు అర్హులవుతారని, ఆడపిల్లల్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత, అలాగే ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఆడపిల్లలకి ఎలాంటి ఆపద వచ్చినా అక్కున చేర్చుకోవడానికి బాలసదనాలున్నాయన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 181,112, 100లకు కాల్ చేసి తెలపాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, ఆడపిల్లల చదువు గురించి, ఆడపిల్లల భద్రత గురించి, అక్రమ దత్తత గురించి వివరించారు.పిల్లలు డ్రాప్ ఔట్ కాకుండా, అందరూ చదువుకోవాలని, బాల్య వివాహాలు చేసుకోకూడదని, చదువుకొనేల చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నజీమ బేగం మహమ్మద్,జడ్పీహెచ్ఎస్ శాబునాగర్ ఇఎం హెడ్ మాస్టర్:- వీరయ్య, టీచర్స్ కల్పన, జ్యోతి, లక్ష్మీ బాయ్, మనోహరి, జ్యోతి, నాగయ్య, నరేందర్, విజయ భాస్కర్, స్కూల్ స్టాఫ్ అంగన్వాడీ టీచర్స్ షమీమ్, నసీమా స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

## 10 వ వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ ..



**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డులో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన 99 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య ఆదేశాల మేరకు 10 వ వార్డు కౌన్సిలర్ మల్లెల సరిత శ్రీకాంత్ ఆధ్వర్యంలో వార్డులో ఉన్న పలు సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకోని వార్డు యొక్క సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు తెలిపారు.ముఖ్య అతిథిగా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి భాస్కర్ , వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు, జూకంటి సంపత్, నాయకులు ముదిగొండ శ్రీకాంత్, దూడల రాజశేఖర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రత్నపురి ఇన్స్టిట్యూట్ ముందు విద్యార్థుల భారీ నిరసన కార్యక్రమం

## తమను కొట్టిన లెక్చరర్ శివారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్

## విద్యార్థులకు మద్దతు తెలిపిన ఏబీవీపీ, ఎన్ఎస్ యూ ఐ విద్యార్థి సంఘాలు

## పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు.

## విద్యార్థులకు నచ్చజెప్పి శాంతింప చేసిన సీఐ రమణారెడ్డి, ఎస్సై శ్రీధర్ రెడ్డి





**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి11:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తురకల ఖానాపూర్ గ్రామ శివారులో ఉన్న రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో హెచ్ ఓ డి శివారెడ్డి విద్యార్థులపై దారుణంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర కలకల రేపుతుంది. హోంవర్క్ చేయలేదన్న కారణంతో సుమారు 15 మందిని మొదటి సంవత్సరం విద్యార్థులను ఒకే గదిలో బంధించి కేబుల్ వైర్ తో విచక్షణారహితంగా కొట్టినట్లు తెలిసింది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో బుధవారం రత్నపురి ఇన్స్టిట్యూట్ ముందు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తమ పిల్లలను అమానుషంగా కొట్టిన హెచ్వోడి పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వోల్లంత గాయాలతో ఉండటం చూసి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తల్లిదండ్రులను శాంతింప చేసిన జిన్నారం సీఐ రమణ రెడ్డి, ఎస్సై శ్రీధర్ రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొ చ్చారు. ఈ ఘటన నివసిస్తూ ఏబీవీపీ, ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలమందు ధర్నా నిర్వహిం చాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేష్ మాట్లాడుతూ విద్యార్థులపై కేబుల్ వైర్తో దాడి చేయడం దారుణమని వారు ఖండించారు. విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో శారీరకంగా హింసించడం పూర్తిగా తప్పని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు సంబంధిత హెచ్వోడిని పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని, ప్రస్తుతం అతను త్వరలో ఉన్నట్లు సమాచారం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. వెంటనే అతని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడి చేసిన శివారెడ్డిని సస్పెండ్ చేస్తామని రత్నాపూర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ వి ఆర్ డాట్ల హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ధర్నా కార్యక్రమాన్ని విరమించి కళాశాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రంజాన్ స్ఫూర్తి సామరస్యాన్ని చాటిన ఇఫ్తార్ విందు






**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** రంజాన్ మాసం ఆధ్యాత్మికత, సహనం మరియు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్న నేపథ్యంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెఐహెచ్ ప్రధాన కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిసిపి (అడ్మిన్) బి. రామానుజం, అడిషనల్ ఎస్పీ (ఇంటెలిజెన్స్) రామోజీ రమేష్ హాజరయ్యారు. రంజాన్ మాసం మనిషిలో ఆత్మశుద్ధి, సేవాభావం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్ర కాలమని వారు పేర్కొన్నారు. సమాజం లో శాంతి, సౌహార్దం, సహనాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం అతిథులు ఉపవాసం విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి ఎండి ముజాహిద్, జేఐహెచ్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, సెంట్రల్ యూనిట్ అధ్యక్షులు ఇంతియాజ్, ఖమ్మం పౌరసమితి అధ్యక్షులు పులిపాటి ప్రసాద్, ఎంపీజే జిల్లా కోశాధికారి ఎండి హకీమ్, బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్రు నాయక్, దక్షిణ మధ్య రైల్వే మాజీ బోర్డు మెంబర్ మట్టా దుర్గాప్రసాద్, ఐటా కార్యదర్శి ముజీబ్, ఆర్పివి అధ్యక్షులు సంజీవరావు, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కార్యదర్శి రఫీక్, మీడియా కన్వీనర్ టి. సంతోష్ చక్రవర్తి, సేవా బ్యాంక్ మేనేజర్ ఎం.డి. రఫీ, ఎంపీజే సభ్యులు అహ్మద్ పాషా, ఖాజా మొహిద్దీన్, అర్షీన్, గౌస్, రజాక్, ఇలియాస్, ఇస్మాయిల్, ఫయాజ్, మతీన్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు ఇంటి పట్టాలు

### ప్రజా పోరాటానికి న్యాయం

### తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్

### 311 మందికి 75 గజాల చొప్పున పట్టాలు

### ఇళ్ల నిర్మాణ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగర శివారు వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇల్లు కూల్చివేతతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు ఆశాకిరణంగా మారాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రివర్యులు బాధితులకు 75 గజాల చొప్పున ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దళిత రత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. భూదాన్ భూముల్లో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు అదే స్థలంలో ఇల్లు నిర్మించాలనే డిమాండ్తో బాధితులు ప్రజా సంఘాలు కుల సంఘాలు వివిధ పార్టీల నాయకులు కలిసి చేసిన పోరాట ఫలితంగానే ఈ నిర్ణయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 311 మంది బాధితులకు ఇంటి పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఇళ్ల నిర్మాణం కూడా మంజూరు చేయడం ప్రజల విజయం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేసినట్టేనని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పట్టాలు అందజేయడం పట్ల తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు శుభాభినందనలు తెలియజేశారు. ఇంకా మిగిలిన అర్హులైన బాధితులకు కూడా త్వరగా ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు వంట సామగ్రి బట్టలలు పిల్లల చదువుల కోసం పాఠశాల తాగునీటి సదుపాయం ఉచిత విద్యుత్ పార్కులు వంటి మౌలిక వసతులు కల్పించి ఆ ప్రాంతాన్ని మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన సంఘాలు నాయకులు బాధితుల ఐక్యతే ఈ విజయానికి కారణమని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు పట్టాలు అందించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు.





# తిరుమలాపూర్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**తుర్కపల్లి ,మార్చి 11 ప్రభాతసూర్య:** తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో బుధవారం మెడిసిటి హాస్పిటల్ మేడ్చల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ డొనికెన రేణుక వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడిసిటీ హాస్పిటల్ వారి వైద్య సేవలను గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు .ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు సభ్యులు వంగ కరుణాకర్ రెడ్డి, సంపత్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ సముద్రాల వెంకటేష్ ,ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్కే హుస్సేన్ చాడ మురళి రెడ్డి, నూకల మల్లేష్ ,నాంసాన్ యాదగిరి, తూటి కిష్టయ్య ,బూసి మల్లయ్య, మెడిసిటీ హాస్పిటల్ డాక్టర్ లలిత, డాక్టర్ చాందిని డాక్టర్ శ్రావణి ,డాక్టర్ మౌనిక ఝాన్సీ ,ఫార్మసిస్ట్ కవిత, మార్కెటింగ్ సిబ్బంది రాఘవేందర్ రెడ్డి, సాయి కుమార్ పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమిలో ఉన్న కబ్జాను తొలగించిన రెవెన్యూ సిబ్బంది.



**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి11:** హత్నూర మండల పరిధిలోని తురకల ఖానాపూర్ గ్రామపంచాయతీలోని సర్వేనెంబర్ 57 లోని అసైన్డ్ భూమి చుట్టూ ఏర్పాటుచేసిన సిమెంట్ పలకల్ని బుధవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. గతంలో గ్రామానికి చెందిన నిరుపేదలకు కేటాయించిన భూమిలో 8 గుంటల స్థలాన్ని స్థిరాస్తి వ్యాపారి 2019లో కొనుగోలు చేశారు. ఆ స్థలం చుట్టూ సిమెంట్ పలకలు వేసి రెండు వైపులా ఇనుప గేట్లు పెట్టారు. అందులో నిర్మాణాలు చేపట్టేందుకు రెండు రోజుల క్రితం బోర్ వేయించగా స్థానికలు గుర్తించి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ తాసిల్దార్ కరుణాకర్ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాహుల్, జి పి ఓ లు సత్యనారాయణ, సాయికుమార్ అక్కడికి వెళ్లి దగ్గరుండి పలకలని నెలమట్టం చేశారు. అక్రమంగా వేసిన బోరును సీజ్ చేశారు అసైన్డ్ భూమిని కొనుగోలు చేయడం విక్రయించడం నేరమని హెచ్చరించారు. ఎనిమిది గంటల భూమిని మూడు లక్షలకు కొనుగోలు చేసినట్టు స్థిరాస్తి వ్యాపారి రాసుకున్న పత్రాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసినట్లయితే ఇలాంటి చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

# అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత...

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య..** ఆలేరు మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై అధికారులు చర్యలు చేపట్టి ఐదు ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు. మండల పరిధిలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.ఎస్.ఐ వినయ్ కుమార్ ఇచ్చిన సమాచారం ప్రకారం డ్రైవర్ల వివరాలు .దొప్పా మహేష్ (TG 30 TR 4101), ఊట్కూరి బాలరాజు (టూ 30 రూ 2305), బండి రాజు (TG 30 T 1390), దాడిగె రవి (TG 30 A 8310), రాపాక వెంకటేష్ (TG 30 A 0570) కు చెందిన పట్టుబడిన ట్రాక్టర్లపై సంబంధిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి..

ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య: విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా ఆత్మస్థైర్యం తో బోర్డు పరీక్షలు రాయాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ధూపటి వెంకటేష్ తెలిపారు. బుధవారం రోజున పట్టణ కేంద్రంలో ఏకశిలా స్కూల్ లో ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ ఆధ్వర్యంలో ధూపటి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పరీక్షల సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అలాగే మొబైల్ ఫోన్లను వాడటం తగ్గించా...



మద్యం నేడు ఇది కేవలం ఒక పానీయం కాదు, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలను నింపే కామధేనువు.కానీ, అదే సమయంలో లక్షలాది కుటుంబాల పాలిట కాలయముడు.ఒకవైపు కోట్లాది రూపాయల రాబడి, మరోవైపు ఛిన్నాభిన్నమవుతున్న సామాన్య జీవితాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) వెల్లడించిన గణాంకాలు వింటే ఎవరికైనా వెన్నులో వణుకు పుట్టక మానదు. భారతదేశంలో సుమారు 16 కోట్ల మంది మద్యం తాగుతుండగా, అందులో 1.5 కోట్ల మంది పూర్తిస్థాయిలో దానికి బానిసలైపోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల యువత ఈ మత్తులో చిక్కుకుపోవడం. కాలేయం పూర్తిగా దెబ్బతిని మరణించే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. జ్ఞాపకశక్తి తగ్గడం, మానసిక అస్థిరత, నిర్ణయాధికారం కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గ్యాస్ట్రిక్ అల్సర్లు, ప్యాంక్రియాటైటిస్ వంటి సమస్యలు ప్రాణాంతకమవుతున్నాయి.వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ ఆసుపత్రులలో చేరుతున్న రోగుల్లో 40 శాతం మంది మద్యపాన సంబంధిత వ్యాధులతోనే వస్తున్నారు. ఏడాదికి 2.5 లక్షల మంది మద్యం వల్ల చనిపోవడం అనేది యుద్ధంలో జరిగే ప్రాణనష్టం కంటే దారుణమైనది. మద్యం ప్రభావం కేవలం తాగే వ్యక్తితోనే ఆగిపోదు. అది ఒక చెయిన్ రియాక్షన్ లాంటిది. ఒక వ్యక్తి తాగి ఇంటికి వస్తే, అక్కడ భార్యకు వేధింపులు, కఠినంగా అమలు చేయాలి. పాఠశాల స్థాయి నుండే మద్యం వల్ల కలిగే అనర్థాలను పాఠ్యాంశాల్లో చేర్చాలి. బాధితుల కోసం ప్రతి జిల్లాలో ఉచిత పునరావాస కేంద్రాలను (Rehabilitation Centers) ఏర్పాటు చేయాలి. కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటక రంగం ద్వారా ఆదాయాన్ని పెంచుకున్నాయి. మన రాష్ట్రాలు కూడా ఐటి, తయారీ రంగం మరియు పర్యాటకంపై దృష్టి సారించి మద్యంపై ఆధారపడటాన్ని తగ్గించాలి. ఇది కేవలం ప్రభుత్వం చేయాల్సిన పని కాదు. స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, యువజన సంఘాలు మద్యం వ్యతిరేక ప్రచారాన్ని ఉద్యమంలా చేపట్టాలి.రాష్ట్ర ఖజానా నిండటం ముఖ్యం కాదనలేం, కానీ ఆ నిధులు ప్రజల రక్తం మరియు కన్నీళ్లతో కూడినవి

# తాగేవాడు ఒక్కడే.. కానీ ఏడుస్తున్న కుటుంబాలు ఎన్నో!

గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, పట్టణాల్లో 32 శాతం పురుషులు క్రమం తప్పకుండా మద్యం సేవిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, రోజుకు సగటున 20 లక్షల లీటర్ల మద్యం గొంతు దిగుతోంది. పండుగలు, వారాంతాల్లో ఈ ప్రవాహం రెట్టింపు అవుతోంది. ఒక సామాన్య మధ్యతరగతి లేదా పేద కుటుంబం తన కష్టార్జితంలో 20 శాతం కేవలం మద్యం కోసమే ఖర్చు చేస్తోందంటే, అది ఆ కుటుంబ ఆర్థిక వెన్నెముకను ఎంతలా దెబ్బతీస్తుందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలకు మద్యం అనేది ఒక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 30,000 కోట్లు, తెలంగాణలో రూ. 25,000 కోట్లు వార్షిక ఆదాయం ఈ వ్యాపారం నుండే వస్తోంది. అంటే రాష్ట్ర మొత్తం రాబడిలో సుమారు 15 నుండి 25 శాతం వాటా మద్యం అమ్మకాలదే. ఈ ఆదాయంపై ఉన్న మక్కువతో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చుకుంటున్నాయి. కానీ ఇక్కడే ఒక విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో ప్రజలకు పథకాలు ఇస్తూ, అదే మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గల్లీ గల్లీకి మద్యం దుకాణాలు విస్తరించడం, అనుమతులు సులభతరం చేయడం వెనుక ఉన్నది కేవలం ఆదాయ కాంక్షేనని స్పష్టమవుతోంది. మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలు కేవలం హ్యాంగోవర్‌తో ముగిసిపోవు. అది శరీరంలోని ప్రతి అంగాన్ని నిర్వీర్యం చేస్తుంది. మద్యం వల్ల పిల్లలకు భయం, తల్లిదండ్రులకు ఆవేదన మిగులుతాయి. మద్యం మత్తులో జరిగే గృహ హింస కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.ఆర్థికంగా చూస్తే, మద్యం సేవించే పేద కుటుంబాల్లో పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. పౌష్టికాహారం కరువవుతోంది. రుణాల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో 35 శాతం మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయి. అంటే, తప్పు చేసిన వాడు మాత్రమే కాదు, అమాయక బాటసారులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకవైపు టీవీల్లో, పత్రికల్లో మద్యపానం ఆరోగ్యానికి హానికరం అని ప్రకటనలు ఇస్తూనే, మరోవైపు కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టడం ప్రభుత్వాల ద్వంద్వ విధానానికి నిదర్శనం. మద్యం నిషేధం అనేది ఒక రాజకీయ నినాదంగా మారిపోయింది. బీహార్ వంటి రాష్ట్రాల్లో నిషేధం విధించినా, అక్కడ అక్రమ మద్యం (నాటు సారా) ప్రవాహం పెరిగి, నకిలీ మద్యం తాగి వందలాది మంది మరణించడం చూస్తున్నాం. అంటే, కేవలం నిషేధం విధిస్తే సరిపోదు, దాని వెనుక ఉన్న డిమాండ్ ను తగ్గించే దిశగా అడుగులు పడాలి. ఆదాయం పోతుందనే భయంతో ప్రభుత్వాలు ఈ విషయంలో మొక్కుబడి చర్యలకే పరిమితమవుతున్నాయి. ఈ సంక్షోభం నుండి బయటపడటానికి బహుముఖ వ్యూహం అవసరం, మద్యం దుకాణాల పనివేళలను తగ్గించాలి. విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలకు సమీపంలో దుకాణాలను కచ్చితంగా తొలగించాలి. 21 ఏళ్ల లోపు వారికి మద్యం అమ్మకూడదనే నిబంధనను కాకూడదు. ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పాలకులు ఆలోచించాలి. ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి నిజమైన సంపద. మద్యం రక్కసి బారి నుండి సమాజాన్ని రక్షించకపోతే, రాబోయే తరాలు బలహీనమైన ఆరోగ్యంతో, విచ్ఛిన్నమైన కుటుంబ వ్యవస్థతో పోరాడాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు, ప్రజలు మేల్కోవాలి. మద్యం లేని సమాజం ఒక కల కావచ్చు, కానీ నియంత్రిత మరియు బాధ్యతాయుతమైన సమాజం సాధ్యమే. ప్రభుత్వాలు ఆదాయం వెనుక పరిగెత్తడం ఆపి, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా అడుగులు వేయాలని ఆశిద్దాం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి

## యూరియా బుకింగ్ యాప్ ను తక్షణం రద్దు చేయాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్

**భూదాన్ పోచంపల్లి, మార్చి 11(ప్రభాత సూర్య):** యాసంగికి సంబంధించిన రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ ను తక్షణమే రద్దు చేయాలని వారు ప్రభుత్వానికి సూచించారు.పోచంపల్లి మండలం పరిధిలోని భీమనపల్లి గ్రామంలో ఇంటింటికీ సిపిఎం కార్యక్రమంలో భాగంగా సిపిఎం నాయకత్వం కలిసి ఇంటింటికి తిరుగి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు రైతులకు పెట్టుబడి సహాయం కింద ప్రతి ఎకరాకు సంవత్సరానికి 15 వేల రూపాయలు ఇస్తానని చెప్పి ఐదు పంటలకు గాను రెండు పంటలకు మాత్రమే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసి మిగతా మూడు పంటలకు డబ్బులు వేయకుండా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. యాసంగి సీజన్ పూర్తయి మరికొద్ది రోజుల్లో కోతలు కూడా రాబోతున్నాయని కానీ ప్రభుత్వము నేటికీ రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని అన్నారు. ప్రభుత్వ పంట సహాయం అందగా పెట్టుబడి కోసము అనేకమంది రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుండి అప్పులు తెచ్చుకొని నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మరో మారు రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల చీకటి రోజులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ హామీ ప్రకారం తక్షణమే రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. మరోపక్క యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా అరికడతామని చెప్పి యూరియా బుకింగ్ యాప్ ను తేవడం వల్ల



రైతాంగం నానా కష్టాలు పడుతున్నారని అన్నారు. ఈ కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా యాప్ సాంకేతిక సమస్యలు, స్మార్ట్ ఫోన్ల కొరత, నెలరోజుల నిబంధన వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. యాప్ లో ఓటిపి రాకపోవడం, స్టాక్ ఉన్న చూపించకపోవడం, ఒకసారి బుక్ చేసుకుంటే మళ్ళీ నెల రోజుల వరకు అవకాశం లేకపోవడం, బుకింగ్ ఐదు నిమిషాలలో అయిపోవడం వల్ల రైతులు పంటలకు సకాలంలో యూరియా అందించ లేక చేలన్నీ ఎర్రగా మారి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. మరో పక్క రాష్ట్రంలో రైతాంగంలో చాలా మంది నిరక్షరాస్యులు గా ఉండడం, చిన్న సన్న కారు రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు లేకపోవడం స్మార్ట్ ఫోన్లు లేకపోవడం, కౌలు రైతులు కూడా భూ యజమాని ఓటీపీని చెప్పడం పోవడం వల్ల నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం బుకింగ్ యాప్ ను రద్దుచేసి పాత పద్దతుల్లో యూరియాను రైతులకు అందించాలని నర్సింహ సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, మండల కమిటీ సభ్యులు కలుకూరి బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బూరుగు బిక్షపతి, నాయకులు ఉప్పునూతల యాదగిరి, చెరుకు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యము... మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్..

**ఆలేరు మార్చి 11 ప్రభాత సూర్య..:** ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ వివిధ వార్డుల్లో పర్యటించారు. బుధవారం రోజున కౌన్సిలర్ మల్లెల సరితతో కలిసి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కస్తూరి ఫౌండేషన్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

**సంస్థాన్ నారాయణపూరశీ, మార్చి 11(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండలం గుడిమల్కాపురం: కస్తూరి ఫౌండేషన్ సహకారంతో సంస్థాన్ నారాయణపూర్ మండలం గుడిమల్కాపురం గ్రామంలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడే విధంగా ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు జాయింట్ రీబాక్సులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సామాజిక సేవా భావంతో ఎప్పటికప్పుడు విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న అంతటి ధనరాజ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా అంతటి ధనరాజ్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామంలో విద్యాభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.విద్యార్థులకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ చిత్ర సేన రెడ్డి, వార్డు సభ్యులు నాగరాజు గౌడ్, వీరమల్ల కార్తీక్ గౌడ్, సంపంగి ఇద్దయ్య, సాహెబ్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళాభారతిలో జాతీయస్థాయి పాటల పోటీలు



**మిర్యాలగూడ మార్చ్ 11 ప్రభాత సూర్యా:** మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జాతీయ స్థాయి నాటక పోటీల లో భాగంగా నేడు జాతీయస్థాయి పాటల పోటీలను శైలజ ప్రతాప్ కందుకూరి సుదర్శన్ సత్యనారాయణ కన్వీనర్స్ గా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలంగాణ నాటక సమాజాల అధ్యక్షులు తడకమళ్ల రామచంద్రయ్య, అధ్యక్షులు రామావతారం లక్ష్మీనారాయణ శర్మ,పులి కృష్ణమూర్తి తెలిపారు. ఈ పాటల పోటీలలో విజేతలైన వారికి మొదటి బహుమతి 5000 రెండవ బహుమతి 4000 మూడవ బహుమతి 3000 తో పాటు కన్సోలేషన్ సర్టిఫికెట్ మెమొంటోలు అందజేయడం జరుగుతుందని అన్నారు బుధవారం పాటలకు సంబంధించిన కరపత్రాన్నిఆవిష్కరించారువిద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, కళాకారులు ఎల్లయ్య ,సరస్వతి, శ్రీనివాస్, సోమేష్ లు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి ఆకస్మిక తనిఖీ



**పెబ్బేరు మార్చి 11 ప్రభాత సూర్య :** పెబ్బేరు మండలం బునియాదిపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ విజయరాములు బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు తనిఖీలో భాగంగా పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ ఎల్ ఎస్, ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రాంలతోపాటు విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల పనితీరును ఆయన పరిశీలించారు.తరగతి గదిలో తెలుగు,గణితం,ఇంగ్లీష్ విషయాలలో విద్యార్థులను ప్రత్యక్షంగా పరిశీలించి వారి ప్రదర్శన సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు.అలాగే మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు భోజన విషయంలో విలువైన సూచనలు తెలిపారు

## మోడల్ స్కూల్ లో విద్యార్థులకు బహుమతులు ప్రధానం

### ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్

**పెబ్బేరు మార్చి 11 ప్రభాత సూర్య:** తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజ్ పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు కాంపిటీటివ్ ఈవెంట్స్ నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా క్విజ్ పోటీల్లో చింతకుంట యశ్వంత్, మనీష్ లు,డ్రాయింగ్ కాంపిటీషన్లో నయనిక, హేమశ్రీ వైష్ణవి, రంగోలి పోటీల్లో కావ్య దీక్షిత స్రవంతి మీనాక్షి, వ్యాసరచన పోటీల్లో రితిక, ఏకాంబరి కార్తీక్, యానాద్వైత్ మంచి ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా సైన్స్ ఎగ్జిబిట్ ప్రదర్శనలో భాగంగా ధనుష్ అక్షిత్, గీతాన్విత, అమృత, నిఖిల్ . వీరందరికీ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్, విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిన్న గోపాల్, ఫకీరయ్య, వేణు, హేమలత, స్వాతి, చిన్నయ్య, డాక్టర్ సి డి బుచ్చయ్య, విజయలక్ష్మి, అబ్దుల్ మోసిన్, మంగమ్మ, గంగాధర్, రమేష్, నర్సింహులు, సుమిత్ర, రవికుమార్, నాగమణి, ఖదీర్, హఫీజ్, అంజనీ దేవి, సాహిత్య పిడి కమలాకర్, మంజునాథ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.